క్లుప్తంగా

తాగునీటి సరఫరా పునరుద్ధరణ


కుళాయి ద్వారా తాగునీరు విడుదల చేస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట ఎస్సీ, ఎస్టీ కాలనీకి తాగునీరు సమస్య మంగళవారం పరిష్కారమైంది. తాగునీరు సరఫరా చేయనందుకు నిరసనగా అప్పయ్యపేట ఎస్సీ, ఎస్టీ కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ఎంపీడీఓకార్యాలయం ఎదుట ధర్నా చేయడంతో ఎంపీడీఓ త్రివిక్రమరావు స్పందించారు. దీర్ఘకాలంగా తాగునీరు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ కాలనీకి ఇంటింటి కుళాయిలు ద్వారా తాగునీరు మంగళవారం సరఫరా చేసినట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలియజేశారు. ఎప్పుడు నీరు విడుదలైనా నిరంతరం కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈని ఈ సందర్భంగా ఎంపీడీఓ కోరారు. దీంతో కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న తాగునీరు సమస్య పరిష్కారమైనందున, తాగునీటి సరఫరాకు కృషి చేసిన అధికారులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్నదాతకు అండగా మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: 'రైతన్నకు అండగా' నిలిచేందుకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన కార్యక్రమానికి చర్యలు చేపట్టామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ కేంద్రంలో రైతన్నలకు మద్దతుగా ప్రతి గ్రామం నుంచి, వార్డుల నుంచి రైతు సోదరులతో కలిసి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నామన్నారు. నాడు కూటమి ప్రభుత్వం రైతన్నలకు పెట్టుబడి సాయం కింద రూ. 20,000, సూపర్ సిక్స్ హామీలు తక్షణం నెరవేర్చాలని, ధాన్యానికి కనీస మద్దతు ధర ఇచ్చి దళారీ వ్యవస్థను తొలగించి తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని, అలానే ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరుతున్నామని తెలియజేశారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు వలిరెడ్డి జగదీష్ అన్నారు. పార్వతీపురంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ఉన్నతంగా జీవించాలంటే హక్కులపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, సీఐ మురళీధర్‌ల ఆధ్వర్యంలో పేదలకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు.

వరిచేను కుప్ప దగ్ధం


సీతానగరం: కాలిపోతున్న వరిచేను కుప్ప

సీతానగరం: మండలంలోని బక్కుపేట గ్రామంలోని పొలంలో వరిచేనుకోసి మడిలో వేసిన కుప్ప మంగళవారం దగ్ధం కావడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కె.వెంకటరమణ పది రోజులక్రితం వరిచేను కోశాడు. వాతావరణం అనుకూలించక పోవడం వల్ల మడిలో నూర్పు చేయాల్సిన 50 సెంట్ల విస్తీర్ణంలో కుప్ప వేశాడు. వేసిన వరిచేను కుప్ప కాలి బూడిదవడంతో రైతు వెంకటరమణ రోదిస్తున్నాడు. ఏడాది పొడవునా కుటుంబానికి అవసరమైన తిండిగింజలు కాలి పోవడంతో ఏం చేయాలో తెలియక భోరున విలపిస్తున్నాడు. అగ్ని ప్రమాదంలో 13 క్వింటాళ్ల ధాన్యం కాలి బూడిదైనట్లు బాధిత రైతు తెలియజేశాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని ఏఎస్సై శ్రీనివాసరావు పరిశీలించారు.


బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

పెరిగిన ధరలు పేరుకుపోయిన బకాయిలు

- నిర్వాహకులకు 4నెలల బిల్లుల బకాయి
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఎండీఎం నిర్వాహకులు
- అప్పులు తీర్చలేకున్నామని ఆందోళన

బలిజిపేట:

పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం కింద వంటలు చేస్తున్న నిర్వాహకులకు నాలుగు నెలలుగా బకాయిలు పేరుకుపోవడంతో అప్పులతిప్పలు తప్పడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఒకవైపు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. మెనూ చార్జీలు అందక అప్పులుచేసి, కష్టపడి వంటలు వండి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నభోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరుచేస్తున్నాయి. వాటిలో సింహభాగం కేంద్ర ప్రభుత్వం నిధులు కాగా రాష్ట్రం కేటాయించేది నామమాత్రమే. కానీ వాటికి కూడా సరిగా నిధులు జమచేయకపోవడంతో అప్పులు చేసి పెడుతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి బియ్యం, కోడిగుడ్డు అందుతుండగా వంటకు అవసరమైన కందిపప్పు, కూరగాయలు, గ్యాస్, నూనె, వంటసామగ్రి, తదితర వాటిని భోజన తయారీదారులే కొనుగోలు చేసి వంటలు చేస్తున్నారు. ప్రతిరోజు చేతి డబ్బులు పెట్టలేక అరువు తెస్తే దానికి షాపులవారు అధికంగా ధరలు వేస్తుంటారని నిర్వాహకులు వాపోతున్నారు. కూరగాయలు ఏది కొన్నా కిలో రూ.60 ఆపైన ఉంటున్నాయని, షాపుల్లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత రేట్ల ప్రకారం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన భోజనం చేస్తున్న విద్యార్థికి ఒకరికి కేంద్ర ప్రభుత్వం రూ.5.45పై ఇస్తే దానికి రాష్ట్ర ప్రభుత్వం 43పైసలు కలిపి రూ.5.88పై.చొప్పున, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఒకొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.8.17పై. ఇస్తుండగా దానికి రాష్ట్ర ప్రభుత్వం 40పైసలు జత చేసి రూ.8.57పై. ఇచ్చేది. కొత్త రేట్లు డిసెంబర్ 1వ తేదీనుంచి మారాయి. పాత రేట్ల ప్రకారం నిర్వాహకులకు 4నెలల బకాయిలు పేరుకుపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

బలిజిపేట మండలంలో విద్యార్థుల వివరాలు

తరగతి	విద్యార్థులు
1నుంచి 5వ తరగతి	1,457మంది
6,7,8తరగతులు	1,037మంది
9,10తరగతులు	804మంది

మండలంలో 56పాఠశాలలకు సంబంధించిన నిర్వాహకులకు లక్షల్లో బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు.

రూ.2లక్షలకు పైగా బకాయి



బలిజిపేట ఉన్నత పాఠశాలలో 496మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి పాత రేట్ల ప్రకారం రావాల్సిన బకాయి నెలకు రూ.60వేలు ఉంటుంది. 4నెలలకు కలిపి రూ.2లక్షలకు పైగానే ఉంది. అప్పులుచేసి వండుతున్నాం. నిత్యావసర సరుకులు, కూరగాయల రేట్లు పెరిగాయి. త్వరలోనే డబ్బులు జమఅవుతాయని చెబుతున్నారు. అవి వస్తేనే అప్పులు తీర్చగలం.

– మేరీ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, బలిజిపేట ఉన్నత పాఠశాల


మార్కెట్‌లో కూరగాయలు

గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధితో సంపూర్ణ ఆరోగ్యం


గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: గాంధీజీ ఆశయ సాధనకు గ్రామాల్లో సుస్థిరమైన అభివృద్ధి పనులు చేపట్టినప్పుడే ప్రజలను సంపూర్ణమైన ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దవచ్చని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీజీ చిత్రపటానికి ఎంపీడీఓ త్రివిక్రమ రావు పూలమాలాంకృతం చేసి గాంధీజీ ఆశయసాధనకు అంతా కృషి చేస్తామని సిబ్బంది, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా అభివృద్ధి పనులు చేట్టడానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాల్సి ఉందని సూచించారు. ప్రజలకు అత్యవసరమైన తాగునీరు, గాలి, చెట్టు, వైద్యసేవలు, నీడ వసతులు కల్పించినప్పటికీ స్థిరమైన అభివృద్ధి పనులు ప్రణాళిక ఆధారంగా జరగాలన్నారు. సామాజిక పరమైన అభివృద్ధి చేయడానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు, ఎంఈఓ జి.సూరిదేముడు, పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్వీ రమణ పాల్గొన్నారు. బుధవారం శిక్షణ ఉంటుందని సర్పంచ్‌లు,కార్యదర్శులు విధిగా పాల్గొవాలని ఎంపీడీఓ కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం


బూర్జలో మాట్లాడుతున్న ఎస్సై ఎం. రాజేష్

సీతానగరం: గ్రామ, పట్టణప్రాంతాల్లో జరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బూర్జలో మంగళవారం రాత్రి సైబర్ నేరాలు నిరోధించడంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆదేశాలమేరకు ప్రస్తుతం గ్రామాల్లో సైబర్ నేరాలు నిరోధించడానికి, రోడ్డు ప్రమాదాలు నివారించడానికి, మాదకద్రవ్యాలు బారిన పడివారు తీసుకోవలసిన జాగ్రత్తలు, వివరించామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాల్లో వాహన చోదకులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ రోడ్డు కిరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎల్ శ్రీనివాసరావు, మోటార్ వాహనాల యజమానులు, పోలీస్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసేదెప్పుడు!

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు

పాలకొండ రూరల్: ఖరీఫ్ వరి కోతలు, నూర్పిళ్లు దాదాపు పూర్తి కావచ్చాయని ఈ క్రమంలో ధాన్యం కొనుగోలు పూర్తి స్థాయిలో చేపట్టాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పాలకొండ నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి దాదాపు 40కి పైబడి ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి కేవలం 2800 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారని మండిపడ్డారు. ఓ వైపు తుఫాన్ హెచ్చరికలు చేస్తూ రైతుల నుంచి ధాన్యం సేకరణలో వెనకడుగు వేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దళారుల దందా సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళారుల బారిన పడిన రైతులు ఎకరాకు సుమారు రూ.3,500 నష్టపోతూ తప్పనిసరి పరిస్థితుల్లో వారికే విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ లెక్కన పాలకొండ నియోజకవర్గంలో 59 వేల ఎకరాల్లో వరి సేద్యం జరగ్గా సుమారు రూ.1.24కోట్లు దోపిడీకి గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పరిశీలన


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

- డాక్టర్ జగన్‌మోహన్ రావు

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన సమస్యలను ముందస్తుగానే గుర్తించడానికి హెల్త్ స్క్రీనింగ్ దోహద పడుతుందని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు డీవీఎం మున్సిపల్ హైస్కూల్, 14 వ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యసిబ్బంది చేపడుతున్న హెల్త్ స్క్రీనింగ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆరోగ్య తనిఖీల వివరాలు రికార్డులో, ఆన్‌లైన్ నమోదు తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా అనారోగ్య సమస్యలు గుర్తించారా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బరువు, శారీరక ఎత్తు, హీమోగ్లోబిన్ శాతం, చేయి, తల చుట్టుకొలతతో పాటు అనారోగ్య లక్షణాలైన దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం లక్షణాలు, ఊపిరితిత్తుల సమస్యలు, దృష్టి సమస్యలు మొదలగు ఆరోగ్య సమస్యలను గుర్తించడానికి నిర్వహించిన హెల్త్ స్క్రీనింగ్ పరిశీలించారు.

అసాధారణంగా గుర్తించిన నివేదికలు, అనారోగ్య సమస్యలపై తరగతుల వారీగా జాబితాను సిద్ధం చేసుకుని విద్యార్థుల్లో ఆ సమస్యల నివారణకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అనంతరం డాక్టర్ జగన్‌మోహన్ విద్యార్థులకు ఆరోగ్య సర్వే ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి. వరప్రసాద్, పి.గోవింద, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, వైద్యసిబ్బంది ఉమ, సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎస్. అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని రంగంపేటలో మంగళవారం జీరోటిల్లేజ్ విధానం ద్వారా సాగుచేస్తున్న మొక్కజొన్న పంటలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న సాగుకు సారవంతమైన, నీరు ఇంకే నల్లరేగడి నేలలు అనుకూలమైన వన్నారు. నీరు నిల్వ ఎండే భూములు మొక్కజొన్నసాగుకు పనికి రావని, విత్తన మోతాదు ఎకరా విస్తీర్ణానికి 8 కేజీలు వేసుకోవాలని, కిలో విత్తనానికి 3 గ్రాములు మంకోజెబ్ లేదా థైరంలేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే లేతదశలో మొక్కల్లో ఆశించే తెగులును నివారించవచ్చన్నారు. విత్తే సమయంలో 1/3,వంతు నత్రజని, మొత్తం భాస్వరం,1/2వ వంతు పొటాష్ ఎరువును వేయాలని సూచించారు. మొక్కల్లో జింక్ లోపం(ఆకుల ఈనెల మధ్యభాగం పసుపురంగుపచ్చరంగు లోకి మారడం, లేత పైరు తెల్లగా మారడం) కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాములు జింక్ సల్ఫేట్ మందు కలిపి ద్రావణాన్ని 250 లీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. పంటకు విత్తనాలు విత్తిన తరువాత రెండు లేదా మూడు రోజుల్లో అట్రజిన్ కలుపు మందు 1000 గ్రాములు 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. గడ్డిమందు పిచికారీ చేయడం వల్ల కలుపును నివారించవచ్చని తెలియజేశారు.

హెచ్‌సీ రామకృష్ణ సేవలు అభినందనీయం


హెచ్‌సీ రామకృష్ణను శాలువాతో సత్కరిస్తున్న ఎస్సై రాజేష్, సిబ్బంది

సీతానగరం: హెచ్‌సీగా పదోన్నతితో బదిలీపై బొబ్బిలి పోలీస్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లిన హెచ్‌సీ జి.రామకృష్ణ సేవలు అభినందనీయమని, ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్ రామకృష్ణకు ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పూలమాలను వేసి శాలువా కప్పి బొబ్బిలి వీణ అందజేసి మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ ఇక్కడి స్టేషన్‌లో 8 సంవత్సరాలు కంప్యూటర్ విధులు నిర్వహించి రికార్డులు అందించిన ఆయన సేవలు మరువలేనివన్నారు. పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది కొరత ఉన్న సమయమంలో విధి నిర్వహణతో పాటు సేవలందించారని అన్నారు.సన్మాన గ్రహీత రామకృష్ణ మాట్లాడుతూ 29 సంవత్సరాలుగా పోలీసుశాఖలో సహచర సిబ్బంది, అధికారుల సహకారంతో సేవలందించి మన్ననలు పొందినట్లు తెలియ జేశారు. సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బొబ్బిలి పోలీస్ సర్కిల్ కార్యాలయానికి బదిలీ అవడంతో తప్పని పరిస్థితుల్లో వెళ్లవలసి వస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు ఎల్ శ్రీనివాసరావు, లక్ష్మణరావు, హెచ్‌సీలు రామినాయుడు,తిరుపతిరావు,సుజాత,సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి

- ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి


సమావేశంలో మాట్లాడుతున్న రాణి

బలిజిపేట: బాల్య వివాహాలను అరికట్టి, సమాజంలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను నిరోధించాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ ఎంఎస్ రాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఐసీడీఎస్ బలిజిపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో బలిజిపేటలోని వైశ్య కల్యాణమంటపంలో సచివాలయాల పరిధిలో ఉండే వివిధ శాఖలకు చెందిన ఆరుగురేసి సిబ్బందికి కిశోరీ వికాసంపై ఒక్కరోజు మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలు, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, పాఠశాలలకు వెళ్లకుండా ఉండిపోయే చిన్నారులు వంటి అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. వాటిని నియంత్రించడానికి సచివాలయ స్థాయిలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కృషిచేయాలని కోరారు. ప్రతి విషయంలో చొరవతీసుకుని వారికి అవగాహన కల్పించి వారిని మంచిమార్గంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ సులేఖ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతతో సరుకులు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలకు నాణ్యత గల సరుకులను పంపిణీ చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ట్రేడర్లను ఆదేశించారు. ఫుడ్ ప్రొవిజన్స్ టెండర్ ప్రక్రియ స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. టెండర్ల ప్రక్రియలో మొత్తం 14 మంది ట్రేడర్లు పాల్గొనగా ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే సరుకుల నాణ్యతలో రాజీ పడరాదని, టెండర్ ఖరారైన ట్రేడర్స్ నిర్ణీత సమయానికి నాణ్యతతో కూడుకున్న సరుకులను అందించాలని పేర్కొన్నారు. సకాలంలో పంపిణీ చేయని పక్షంలో సరుకులు తిప్పి పంపించాలని, వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్, డీఎం, జీసీసీ, ఏపీఓ, ఏటీడబ్ల్యూఓ, జీసీసీ బ్రాంచ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు ఆపి సమస్యలు పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: బెదిరింపులు ఆపి సమస్యల పరిష్కారం చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, సురేష్, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడంగి సాయిబాబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద జరుగుతున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షలో మంగళవారం పాల్గొన్న వారు మాట్లాడుతూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం, వేరే పాఠశాల ఉపాధ్యాయులను డిప్యుటేషన్ వేసి బెదిరించడం చేయడం మానుకోవాలని హితవు పలికారు. చాలీచాలని జీతాలతో విద్యా సేవలు అందించిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. భవిష్యత్ పోరాటాలకు బాసటగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గరుగుబిల్లి:

కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎస్.రాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమైన ఆమె.. కిశోరి వికాసంపై పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అలాగే కిశోరి బాలికలకు పౌష్టికాహారం–దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు.

బాలికల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని, బడి మధ్యలో మానేసిన విద్యార్థులను బడిలో చేర్పించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఐసీడీఎస్ పీవో సుగుణ కుమారి, డీసీపీవో ఎ.సత్యనారాయణ, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి కెకె సాగర్ వర్మ, ఎంఈవో దత్తి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ మాట్లాడుతూ కిశోరి బాలికల ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాలని, వారు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, ఎంఈవో బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాణి